
సాక్షి
నల్లగొండ
మంగళవారం ၊ 4 ၊ ఏప్రిల్ ၊ 2023



స్పిల్‌వే పనులు పూర్తి చేయాలి
నాగార్జున సాగర్ స్పిల్‌వే పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ ఆదేశించారు. - 10లో



అటకెక్కిన యాదాద్రి మాస్టర్ ప్లాన్
యాదాద్రి అభివృద్ధిలో భాగంగా పెద్దగుట్టపై ఏర్పాటు చేస్తున్న టెంపుల్ సిటీ చిట్టడవిని తలపిస్తోంది. - 10లో

గరిష్టం/కనిష్టం
37°/24°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

నల్లగొండ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అందించిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే విచారించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. భూ సంబంధిత సమస్యలు, ల్యాండ్ సర్వే, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, పంచాయతీ రాజ్ శాఖ , ఇతర శాఖలకు సంబంధించిన 37 దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్ రెడ్డి, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టీజీఓస్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ : తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నల్లగొండ జిల్లా క్యాలెండర్, డైరీని కేంద్ర సంఘం అధ్యక్షురాలు మమతతో కలిసి సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి పుల్లెంల రవీందర్‌కుమార్‌గౌడ్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ముజీబుద్దీన్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, జిల్లా గౌరవ అధ్యక్షుడు గోన మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పనులు ఆపకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం

చందూరు(గట్టుప్పల) : గట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న కాంతి లేబొరేటరీస్ నిర్మాణ పనులను వెంటనే ఆపాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని అఖిలపక్ష కమిటీ నాయకులు హెచ్చరించారు. సోమవారం స్థానిక రైతువేదికలో అఖిల పక్ష కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ గట్టుప్పల, వెల్మకన్నె, తేరట్‌పల్లి, పుట్టపాక గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు ఒక్కటిగా ముందుకు సాగుతామని తెలిపారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు ఇడెం కైలాసం, కర్నాటి మల్లేశం, కృష్ణాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, రమేష్, చాపల మారయ్య సత్తయ్య, సత్తయ్య, దొంతగాని పెద్దలు, మల్లేశం, పాండు, దుర్గయ్య, పిట్ట కృష్ణ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎన్నికల అధికారి.. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ఇతర కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, జనరల్ సెక్రటరీ జె.రవికుమార్, ఉపాధ్యక్షులు అయితగోని లాలయ్య, మోర ప్రవీణ్‌కుమార్, కోశాధికారి దాసరి యాదగిరి, ఎన్నికల అధికారి కట్టా అనంతరెడ్డి, మాజీ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొనసాగింపా..
కొత్త అధ్యక్షుడా?

- జిల్లా బీజేపీ అధ్యక్ష పదవి దక్కేదెవరికో..
- కొత్త అధ్యక్షుడి నియామకం తప్పదన్న సంకేతాలు
- ప్రయత్నాలు వేగవంతం చేసిన ఆశావహులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లా బీజేపీకి కొత్త అధ్యక్షుడిని నియమిస్తారా? ఇప్పుడున్న అధ్యక్షుడినే కొనసాగిస్తారా? అన్న చర్చ జోరుగా సాగుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అధ్యక్షులను మార్చుతామన్న సంకేతాలు రాష్ట్ర పార్టీ నుంచి వచ్చిన నేపథ్యంలో అందులో నల్లగొండ జిల్లా ఉందా? లేదా? అన్న దానిపై సస్పెన్స్ నెలకొంది. మునుగోడు ఎన్నికల తరువాత జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు రాష్ట్ర పార్టీ పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిని నియమించే అవకాశాలను కొట్టిపారేయడానికి వీల్లేదని కొందరు పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. జిల్లా అధ్యక్ష పదవిని ఆశించే వారు కూడా తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రధానంగా జిల్లాలో అధ్యక్ష పదవిని నలుగురు ఆశిస్తుండగా, ఎవరిని అధ్యక్ష పదవి వరిస్తుందో త్వరలోనే తేలనుంది.

జాతీయ బృందం సిఫారసు మేరకు..

వాస్తవానికి జిల్లా అధ్యక్షుల పదవీ కాలం గత నెల 20వ తేదీతోనే ముగిసింది. పార్టీ నియమావళి ప్రకారం మళ్లీ అధ్యక్షులను నియమించాల్సి ఉంది. అయితే ఈ ఏడాదే అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో కొత్త వారిని జిల్లా అధ్యక్షులుగా నియమించకుండా, పాత వారినే కొనసాగిస్తారన్న చర్చ కూడా పార్టీ వర్గాల్లో ఉంది. అయితే జిల్లా అధ్యక్షులుగా రెండోసారి కొనసాగుతున్న వారి స్థానంలో కొత్త వారిని నియమిస్తారని, అధ్యక్షుల పని తీరుపట్ల అసంతృప్తి వ్యక్తమైన జిల్లాల్లో వారిని మార్చేసి కొత్త వారికి అవకాశం ఇస్తారన్న వార్తలు కూడా వస్తున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్న లక్ష్యంతో ఉన్న బీజేపీ జాతీయ నాయకత్వం రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఇందులో అన్ని జిల్లాల్లో పార్టీ పరిస్థితులు, జిల్లా అధ్యక్షుల పనితీరు పట్ల జాతీయ పార్టీ బృందాలను పంపించి అభిప్రాయాలను సేకరించింది. ఆ బృందాలు ఇచ్చిన నివేదికల మేరకే జిల్లాల్లో అధ్యక్షుల మార్పు ఉండనున్నట్లు తెలిసింది. అందులో నల్లగొండ కూడా ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

కొత్త అధ్యక్షుడి నియామకం తప్పదంటున్న నేతలు

జిల్లాలో పార్టీ అధ్యక్ష పదవి విషయంలో రాష్ట్ర అధి ష్టానం కూడా కొత్త వారివైపే మొగ్గు చూపుతోందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఇటీవలే పదవీ కా లం ముగిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి విషయంలో జిల్లా పార్టీలోని కొందరు నేతలు అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. అయితే, తాను ఒక దఫానే అధ్యక్షుడిగా చేశానని, రెండోసారి అవకాశం ఇవ్వాలని శ్రీధర్‌రెడ్డి కోరుతున్నట్లు సమాచారం.

ఆ నలుగురిలో ఎవరికో..

ప్రస్తుత జిల్లా అధ్యక్షుడితోపాటు గతంలో ఏబీవీపీలో పనిచేసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ జిల్లా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. జిల్లా బాధ్యతలు అప్పగిస్తే పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఆయన చెబుతున్నారు. అలాగే నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ కూడా పార్టీ అవకాశం ఇస్తే జిల్లాలో పార్టీ విస్తరణకు కృషి చేస్తానని పేర్కొంటున్నారు. మునుగోడు నియోజకవర్గానికి చెందిన నాంపల్లి మాజీ ఎంపీపీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి కూడా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. మునుగోడు ఎన్నికల్లోనూ తాను పనిచేశానని, మిగతా నియోజకవర్గాల్లో పార్టీ విస్తరణకు అవకాశం ఉందని, అందుకోసం తాను పూర్తి సమయాన్ని వెచ్చిస్తానని చెబుతున్నారు. ప్రధానంగా అధ్యక్ష పదవిని ఆ నలుగురు సీనియర్లలో ఒకరికి అప్పగించవచ్చని తెలుస్తోంది. ఇదిలాఉంటే ఏడాది కిందటి నుంచే నల్లగొండ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలతో ప్రజల్లో ఉంటున్న నాగం ఫౌండేషన్ పేరుతో నాగం వర్షిత్‌రెడ్డి మెడికల్ క్యాంపులు వంటి సేవా కార్యక్రమాలు, యువత కోసం క్రికెట్ టోర్నమెంట్స్ వంటివి నిర్వహిస్తున్నారు. ఆయన కూడా తనకు జిల్లా అధ్యక్షునిగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిసింది.



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, కలెక్టర్ తదితరులు

కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకం

- జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

నల్లగొండ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పోరాట పటిమను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డి కొమురయ్యను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య జయంతి (ఏప్రిల్ 3న), వర్ధంతిని (జూలై 4న) అధికారికంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2023 ఏప్రిల్ 2న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు ఖుష్బూ గుప్తా, భాస్కర్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, పాలడుగు నాగార్జున, వైద్యుల సత్యనారాయణ, నేలపట్ల సత్యనారాయణ, లొడంగి గోవర్ధన్, తరాల పరమేష్ యాదవ్, మేకల యాదన్న, వోలి సమీర్‌కుమార్, బీసీ సంక్షేమ అధికారిణి పుష్పలత, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ సల్మా బాను, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ ముజీబుద్దీన్, గనులు, భూగర్భ శాఖ ఏడీ వెంకటేశ్వర్‌రావు, ఉద్యానశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 56 మంది గైర్హాజరు



నల్లగొండలో పరీక్ష రాస్తున్న పదోతరగతి విద్యార్థులు



సెయింట్ ఆల్ఫోన్సెస్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, డీఈఓ

- ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 107 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష సాగింది. తొలిరోజు పరీక్షకు జిల్లాలో మొత్తం 19,237 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 19,176 మంది హాజరయ్యారు 56 మంది గైర్హాజరయ్యారు. నల్లగొండలోని దేవరకొండ రోడ్డులో ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, సెయింట్ ఆల్ఫోన్సెస్ పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పరిశీలించారు. పరీక్ష నిర్వాహణ తీరు, ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా డిస్ట్రిక్ లెవల్ అబ్జర్వర్లు 7 పరీక్ష కేంద్రాలను, డీఈఓ భిక్షపతి 11 కేంద్రాలను, ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ 7 కేంద్రాలను పరిశీలించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 34 కేంద్రాలను తనిఖీ చేశాయి.

కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లినట్లే

- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- గుర్రంపోడులో ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే భగత్ తదితరులు

గుర్రంపోడు : ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీకి ఇక కాలం చెల్లినట్లేనని రాష్ట్ర విద్యుత్‌శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేస్తే.. ఆ పార్టీకి కనీసం సోయి లేకుండా పోయిందని విమర్శించారు. నల్లగొండ జిల్లాలో టేలెండ్ పేరుతో పొలాలను బీళ్లుగా మార్చిన ఘనత కాంగ్రెస్ పాలకులదేనన్నారు. అందుకే.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి అవుతానని కలలు కన్న జానారెడ్డిని ఇక్కడి ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. రాజవరం మొదటి మేజర్ కింద పూర్తిస్థాయిలో నీళ్లు అందించి సస్యశ్యామలం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మోదీ దుర్మార్గాలను నిలువరించేందుకే టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీగా అవతరించిందని చెప్పారు. ఇప్పటికే మహారాష్ట్రలో మోదీకి వ్యతిరేకంగా విప్లవం మొదలైందన్నారు. దేశంలో ఎక్కడా లేని పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నోముల భగత్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, నాయకులు యడవెల్లి విజయేందర్‌రెడ్డి, రాంచంద్రనాయక్, మర్ల చంద్రారెడ్డి, ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గజ్జెల చెన్నారెడ్డి, రామగిరి చంద్రశేఖర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల వెంకన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

పెద్దఅడిశర్లపల్లి : బీఆర్ఎస్ సర్కార్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్‌లు పిలుపునిచ్చారు. సోమవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద జరిగిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో మరోసారి విజయఢంకా మోగించేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు సమన్వయంతో పనిచేసి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. అంతకు ముందు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అంగడిపేట ఎక్స్‌రోడ్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వల్లపురెడ్డి, ముచ్చర్ల ఏడుకొండలుయాదవ్, ముత్యంరావు, అర్వపల్లి సరితానర్సింహ, తోటకూరి పరమేష్, బన్సీలాల్, అంజిరెడ్డి, సిరసువాడ శ్రీను, శీలం శేఖర్‌రెడ్డి, చందూనాయక్, లచ్చిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.

ఆస్తి పన్ను చెల్లింపుపై రాయితీ

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఏప్రిల్ నెలాఖరులోగా చెల్లించిన వారికి ఈ రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. గతంలో ఆస్తి పన్ను చెల్లించకుండా ఉన్న బకాయిలపై రాయితీ వర్తించదని తెలిపారు. ప్రజలు తమ ఆస్తి పన్నును ముందుగా చెల్లించి రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టాలి

నల్లగొండ టౌన్ : ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టి చట్టబద్ధతను కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ ఆడెపు నాగార్జున మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి బోడ సునిల్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు అవుతున్నా.. వర్గీకరణ విషయంలో ఇచ్చిన హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. వెంటనే పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బకరం శ్రీనివాస్‌మాదిగ, కొమిరె స్వామి, ముదుపు శ్రీనుమాదిగ, కురపాటి కమలమ్మమాదిగ, శ్రీశైలం, దేవయ్య, యాదయ్య, వెంకటయ్య, సైదులు, ప్రసాద్, రాజు, మోష, నవీన్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఐదేళ్లు పూర్తయిన పోలీసులకు బదిలీ



బదిలీల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : ఒకే ప్రాంతంలో ఐదేళ్లపాటు విధులు పూర్తి చేసిన 159 మంది పోలీస్ సిబ్బందికి సోమవారం ఎస్పీ అపూర్వరావు కౌన్సిలింగ్ నిర్వహించి కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేశారు. కానిస్టేబుళ్ల సీనియారిటీ ఆధారంగా, ఆరోగ్య సమస్యలను పరిగణలోకి తీసుకొని బదిలీ చేసినట్లు తెలిపారు. కోరుకున్న ప్రాంతానికి బదిలీ కావడం వల్ల సమర్థంగా విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి శేషాద్రినిరెడ్డి, ఏఎస్పీ ప్రసాద్‌రావు, ఏఓ మంజుభార్గవి, డీఎస్పీలు రమేష్, వెంకట్‌గిరి, సూపరింటెండెంట్ దయాకర్, పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజ్, సోమయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదును విచారించాలి

నల్లగొండ క్రైం : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ అపూర్వరావు పేర్కొన్నారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఆమె ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. భార్యాభర్తల వివాదం, కుటుంబ సమస్యలు, భూ వివాదాలు, అధిక వడ్డీ వసూలు తదితర ఫిర్యాదులపై కిందిస్థాయి పోలీస్ అధికారులతో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

మన దగ్గరా.. కొబ్బరి సాగు

- స్థానికంగానే డిమాండ్ ఉండడంతో ఎక్కువ విస్తీర్ణంలో తోటల సాగు
- కేరళ నుంచి మొక్కలు తెప్పించి నాటుతున్న రైతులు
- ఆశాజనకమైన దిగుబడి.. మంచి లాభాలు ఉండడంతో ఆసక్తి



అన్నెపర్తిలో సాగు చేసిన కొబ్బరి తోట



కాతకొచ్చిన కొబ్బరి చెట్టు

నల్లగొండ రూరల్ : కొబ్బరి బోండాలంటే మనకు గుర్తొచ్చేది కోనసీమ, కేరళ, చెన్నై తదితర ప్రాంతాలు. అయితే.. మన దగ్గర నేలలు కూడా అనుకూలంగా ఉండడంతో కొందరు రైతులు కొబ్బరి సాగు వైపు మొగ్గుతున్నారు. మొదట ప్రయోగాత్మకంగా పొలం గెట్ల మధ్య, తక్కువ విస్తీర్ణంలో సాగు చేసి దిగుబడిని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో చండూర్, కనగల్, తిప్పర్తి, నార్కట్‌పల్లి మండలంలో సాగు చేసిన రైతులు ఆశాజనకమైన దిగుబడి పొందుతున్నారు. స్థానికంగానే డిమాండ్ ఉండడంతో చాలా మంది రైతులు కొబ్బరి సాగు వైపు మళ్లుతున్నారు.

జిల్లాలో ఏటా రూ.10 కోట్ల వ్యాపారం..

ఆరోగ్యం కోసం రోజూ కొబ్బరి నీళ్ల తాగాలని వైద్యులు సూచిస్తుంటారు. కానీ కొబ్బరి బోండాలను మనం రాజమండ్రి, కేరళ, చెన్నై ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటాం. దీంతో ఇక్కడ వినియోగదారులు ఎక్కువ రేటు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో ఏటా కొబ్బరి బోండాల వ్యాపారం రూ.10 కోట్ల మేరకు ఉంటుందని వ్యాపారస్తులు చెబుతున్నారు. స్థానికంగానే కొబ్బరి బోండాలు లభించడం ద్వారా రవాణా భారం తగ్గి వినియోగదారులకు కూడా తక్కువ రేటుకే లభిస్తాయని పేర్కొంటున్నారు.

ఆశాజనకంగా దిగుబడి..

జిల్లాలో రైతులు ఎక్కువగా పత్తి, వరి సాగు చేస్తుంటారు. అయితే కొబ్బరి సాగు ద్వారా ఆశాజనకమైన దిగుబడి.. మంచి లాభాలు ఉండడంతో నాలుగేళ్లకే దిగుబడి ఇచ్చే హైబ్రీడ్ రకాలైన కొబ్బరి మొక్కలను కేరళ పరిశోదన కేంద్రం నుంచి, ఇతర ప్రైవేట్ నర్సరీల నుంచి తెప్పించి సాగు చేపడుతున్నారు. కొబ్బరి కాయలో 500 ఎంఎల్ కొబ్బరి నీల్లు ఉండే వెరైటీ మొక్కలు ఎకరానికి 70 వరకు నాటుతున్నారు. ఒక మొక్కకు రోజూ 32 లీటర్ల నీటిని డ్రిప్పు ద్వారా అందిస్తున్నారు. ఏడాది పొడవున ఒక్క చెట్టు నుంచి 250 -300 కాయలు లభిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. కొబ్బరి బోండ ముదిరితే కొబ్బరి వస్తుందని.. దానివల్ల లాభమే తప్ప నష్టం లేదని భావిస్తున్నారు.

ప్రోత్సాహం కరువు

కొబ్బరి సాగువైపు రైతుల ఆసక్తి చూపుతున్నా.. ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించడం లేదు. కేవలం ఆయిల్‌పాం మినహా ఇతర పండ్ల తోటలు, కూరగాయిల సాగుకు ప్రభుత్వం మూడేళ్లుగా డ్రిప్ సరఫరా చేయడం లేదు. దీంతో విద్యావంతులైన, ఆర్థికంగా ఉన్న రైతులు మాత్రమే కొబ్బరి సాగు చేస్తున్నారు. ఉద్యాన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తోటలను పరిశీలించి పురుగు, పిందె రాలుడు నివారణ హైబ్రీడ్ రకాలు, ఎక్కువ నీళ్లు ఉండే మొక్కలను పరిశోదన కేంద్రం నుంచి తెచ్చుకునేలా రైతులకు సలహాలు ఇస్తున్నారు.

కొబ్బరి దిగుబడి బాగుంది



“కొబ్బరి సాగుకు నేలలు, దిగుబడిపై అనుమానం లేకుండా మొదటగా ప్రయోగాత్మకంగా పొలం గెట్ల మధ్య మొక్కలు వేసి చూశాం. దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో నాలుగు ఎకరాల్లో జామ తోటను తొలగించి కొబ్బరి సాగును చేస్తున్నాం. ఒక్క కొబ్బరి బోండాలో సగటున 300 ఎంఎల్ నుంచి 500 ఎంఎల్ నీళ్లు ఉన్నాయి. వ్యాపారులు తోట వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే రైతుకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది.

– మేకల యాదయ్య, అన్నెపర్తి, నల్లగొండ మండలం

సాంకేతిక సలహాలు ఇస్తున్నాం



“కొబ్బరి సాగుకు మన దగ్గర నేలలు అనుకూలంగా ఉన్నాయి. దిగుబడి సమయంలో పూత పిందే రాలకుండా సస్య రక్షణ చర్యలను రైతులకు తెలియజేస్తున్నారు. సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించేందుకు రైతులు ఇచ్చిన దరఖాస్తులను ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. కొబ్బరి లాభదాయకమైన పంట.

– అనంతరెడ్డి, ఉద్యానశాఖ అధికారి

క్లుప్తంగా

పిడుగు పడి గీత కార్మికుడికి గాయాలు

కనగల్: తాటిచెట్టుపై పిడుగు పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని రేగట్టే గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. రేగట్టే గ్రామానికి చెందిన గీత కార్మికుడు గుంటికాడి అంజనేయులు రోజు మాదిరిగా సోమవారం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ఒక్కసారిగా వడగళ్ల వానతో పాటు ఈదురుగాలులు రావడంతో అతడు ఎక్కిన చెట్టుపైనే పిడుగు పడింది. దీంతో అంజనేయులు కిందపడగా తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆయనను నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


సతీష్‌రెడ్డి (ఫైల్)

మునగాల (కోదాడ): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని నేలమర్రి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నేలమర్రి గ్రామానికి చెందిన మెండు గోపాల్‌రెడ్డి, జయమ్మ దంపతుల కుమారుడు మెండు సతీష్‌రెడ్డి(34) వరికోత మిషన్లను లీజుకు తీసుకొచ్చి నడిపిస్తుంటాడు. సతీష్‌రెడ్డి తండ్రి గతంలోనే మృతిచెందగా, తల్లితో కలిసి గ్రామంలోనే ఉంటున్నాడు. సోమవారం గ్రామ శివారులో వరి పొలం కోస్తుండగా వరికోత మిషన్‌కు 11కేవీ వైర్లు అడ్డు రావడంతో వాటిని కర్రతో పైకి లేపే ప్రయత్నం చేశాడు. దీంతో వైర్లు తెగి మీదపడడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి జయమ్మ ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి. లోకేష్ తెలిపారు.

ట్రాక్టర్ ట్రాలీ అపహరణ

మఠంపల్లి: మండల కేంద్రానికి చెందిన రైతు మీసాల వెంకన్నకు చెందిన ట్రాక్టర్ ట్రాలీ చోరీ గురైన విషయం సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 21వ తేదీ రాత్రి మీసాల వెంకన్న ఇంటి ముందు తన ట్రాక్టర్ ట్రాలీని ఉంచాడు. మరుసటి రోజు ఉదయాన్నే చూసేసరికి ఆ ట్రాలీ కనిపించలేదు. ఇన్ని రోజులు చుట్టుపక్క గ్రామాల్లో ఎంత వెతికినా ట్రాలీ ఆచూకీ లభించకపోవడంతో సోమవారం మఠంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతుల తెలిపాడు. ఈ మేరకు విచారణ జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు నిర్వహించారు. సుప్రభాతసేవ, నిత్యహోమం చేశారు. స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం రక్తికట్టించారు. విశ్వక్సేన పూజ, రక్షాబంధనం, రుత్విగ్వరనం, పంచగవ్యప్రాశన, మాంగళ్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్ఛరణలతో కల్యాణతంతు ముగించారు.

జానకిపురం ఎన్‌కౌంటర్‌కు ఎనిమిదేళ్లు

- అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన
- ఉగ్రవాదుల కాల్పుల్లో అమరులైన ఎస్‌ఐ సిద్దయ్య, కానిస్టేబుల్ నాగరాజు
- చివరకు ఉగ్రవాదులను మట్టుబెట్టిన పోలీసులు


ఎస్‌ఐ సిద్దయ్య, కానిస్టేబుల్ నాగరాజు (ఫైల్)


కాల్పుల్లో మృతిచెందిన ఉగ్రవాదులు అస్లాం అయూబ్, జాకీర్ బాదల్

మోత్కూరు: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మోత్కూరు మండలం జానకిపురం గ్రామంలో ఎన్‌కౌంటర్ జరిగి మంగళవారంతో ఎనిమిదేళ్లు పూర్తయ్యాయి. ఏప్రిల్ 4, 2015న జానకిపురం గ్రామ శివారులో ఇద్దరు సిమీ ఉగ్రవాదులు పోలీసులపై కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో అప్పటి ఆత్మకూరు(ఎం) ఎస్‌ఐ సిద్దయ్యతో పాటు అదే పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ చాగోని నాగరాజు అమరులయ్యారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అప్పటి రామన్నపేట సీఐ బాలగంగిరెడ్డి, పోలీసు సిబ్బందికి, ఉగ్రవాదుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో సీఐ బాలగంగిరెడ్డికి గాయాలయ్యాయి. పోలీసు సిబ్బంది జరిపిన కాల్పుల్లో ఇద్దరు సిమీ ఉగ్రవాదులు అస్లాం అయూబ్, జాకీర్ బాదల్ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఎన్‌కౌంటర్ అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఎన్‌కౌంటర్‌కు ముందు రోజు సూర్యాపేట బస్టాండ్‌లో ఉగ్రవాదులు పోలీసులపై కాల్పులు జరిపి పరారయ్యారు. వారి కోసం పోలీసు యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టింది. ఉగ్రవాదులు అర్వపల్లి దర్గా ప్రాంతంలో తలదాచుకొని తిరుమలగిరి మీదుగా మోత్కూరు మండలం చిర్రగూడూరు నుంచి డొంక మార్గం గుండా వెళ్తూ దారితప్పి జానకిపురం గ్రామ శివారుకు చేరుకున్నారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి బైక్‌పై వెళ్లగా బైక్ వాగులోని ఇసుకలో కూరుకుపోవడంతో మరో బైక్ తీసుకొని గ్రామ శివారులోకి ప్రవేశిస్తుండగా ఎదురుగా వచ్చిన పోలీసు వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో డ్రైవర్ సీటులో ఉన్న కానిస్టేబుల్ నాగరాజు అక్కడికక్కడే మృతిచెందగా, ఎస్‌ఐ సిద్దయ్య పొట్ట, తలలోకి తూటాలు దిగడంతో కుప్పకూలిపోయాడు. వారిని హుటాహుటిన హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రెండు రోజుల అనంతరం ఎస్‌ఐ సిద్దయ్య మృతిచెందాడు. తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టిన పోలీసులను యావత్ దేశ ప్రజలు అభినందించారు.

భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు

- రూ.10వేల జరిమానా విధించిన కోర్టు


నిందితురాలు బసవరేఖ

భూదాన్‌పోచంపల్లి: నిత్యం మద్యం తాగి వచ్చి వేధిస్తున్న భర్తను చంపిన భార్యకు సోమవారం భువనగిరి ప్రధాన జిల్లా సెషన్ కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధించింది. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన బండారి శ్రీనుకు మేనమామ కూతురైన పోచంపల్లికి చెందిన బసవరేఖ((26)ను ఇచ్చి పదేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. జీవనోపాధి నిమిత్తం పోచంపల్లికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ శ్రీను కేబుల్ ఆపరేటర్‌గా పనిచేసేవాడు. శ్రీను తన భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకొని మద్యానికి బానిస అయ్యాడు. ప్రతి రోజు మద్యం తాగి వచ్చి భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో 2020, ఫిబ్రవరి 23న భార్యాభర్తలిద్దరూ గొడవ పడ్డారు. దీంతో జరిగిన విషయాన్ని బసవరేఖ తన తల్లిదండ్రులకు చెప్పి ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. అయితే అదే రోజు రాత్రి అత్తవారింటికి వచ్చిన శ్రీను తన పిల్లలను బలవంతంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా భార్య బసవరేఖ గట్టిగా నెట్టివేయడంతో తల గోడకు తగిలి కిందపడిపోయాడు. ఇదే అదునుగా భావించిన బసవరేఖ శ్రీను ముఖంపై దిండుపెట్టి ఊపిరాడనీయకుండా చేసి హత్య చేసింది. ప్రమాదవశాత్తు చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే మృతుడి అన్న బండారి నర్సింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా సోమవారం ఈ కేసు విచారణకు రాగా భువనగిరి ప్రధాన జిల్లా సెషన్ కోర్టు సాక్షాధారాలను పరిశీలించి, నేరం రుజువు కావడంతో నిందితురాలు బసవరేఖకు జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. పూర్తి సాక్షాధారాలను సేకరించి నిందితురాలికి శిక్షపడేలా కృషిచేసిన పోలీసులను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్, జాయింట్ సీపీ వి. సత్యనారాయణ అభినందిస్తూ వారికి రివార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

జాతీయ రహదారిపై ఆయిల్ ట్యాంకర్ బోల్తా

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడింది. వివరాలు.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్(టీఎస్ 09 సీసీ 1083) పెద్దకాపర్తి గ్రామ శివారులోకి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కొద్దిసేపు హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న జీఎమ్మార్ హైవే సిబ్బంది ట్యాంకర్‌ను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం


మౌలానా (ఫైల్)

హాలియా: రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం పాలైన ఘటన హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట స్టేజీ శివారులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్‌కు చెందిన రైతు ఎండీ మౌలానా(62), తన కుమారుడు ఎండీ సర్వర్ కలిసి ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపేట స్టేజీ వద్ద కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారి పక్కనే కౌలుకు తీసుకుని సాగు చేస్తున్న వారి పొలం వద్దకు వెళ్లారు. పొలం వద్ద హైవే పక్కన ఎండీ సర్వర్ ద్విచక్ర వాహనాన్ని ఆపి వరి పొలం కోయడానికి కోత మిషన్ యజమానికి ఫోన్ చేస్తుండగా, జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చిన డీసీఎం వాహనం వీరి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎండీ మౌలానా తలకు తీవ్రగాయాలయ్యాయి. కుమారుడు సర్వర్ తన తండ్రి మౌలానాను చికిత్స నిమిత్తం హాలియాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుమారుడు సర్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం పానకం ధ్వంసం

మద్దిరాల: మండలంలోని కుక్కడం గ్రామపంచాయతీ పరిధిలోని దస్రూతండాలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బెల్లం పానకాన్ని సోమవారం ధ్వంసం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దస్రూతండాకు చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో బెల్లం పానకం నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు దాడి చేసి సుమారు 200లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఎవరైనా తండాలల్లో సారా తయారుచేస్తే కేసులు నమోదు చేస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ హెచ్చరించారు.

కూర్చున్న చోటే వృద్ధుడి హఠాన్మరణం

- మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో ఘటన


బస్టాండ్‌లోని కుర్చీలో విగతజీవిగా కొండయ్య, వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: కుర్చీలో కూర్చున్న వ్యక్తి కుర్చీలోనే ప్రాణాలు విడిచిన సంఘటన మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన కొండయ్య(70)కు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. శ్రీరామనవమి పండుగ సందర్భంగా గత నెల 29న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లిన కొండయ్య తిరిగి సోమవారం సాయంత్రం బస్సులో మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నాడు. బస్టాండ్‌లో బాత్‌రూంకు వెళ్లి వచ్చిన అతడె వాటర్ బాటిల్ కొనుక్కొని నీరు తాగి అక్కడే కుర్చీలో కూర్చున్నాడు. అలా కూర్చున్న అతడు ఎంతసేపటికీ లేవకపోవడంతో ఇతర ప్రయాణికులు గమనించి ఆర్టీసీ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఆర్టీసి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు బస్టాండ్‌కు చేరుకుని కొండయ్యను పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. అతడి వివరాలు తెలుసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు. కాగా కొండయ్య వడదెబ్బతో లేదా గుండెపోటుతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు, బంధువులు భావిస్తున్నారు.

భక్తురాలు పోగొట్టుకున్న పర్సు అప్పగింత


భక్తురాలు మానసకి పర్సు అప్పగిస్తున్న యాదాద్రి ఆలయ ఎస్‌పీఎఫ్ సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చిన ఓ భక్తురాలు పోగొట్టుకున్న పర్సును ఆలయ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పీఎఫ్) సిబ్బంది తిరిగి ఆమెకు అప్పగించారు. ఎస్‌పీఎఫ్ సిబ్బంది సోమేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన మానస అనే భక్తురాలు సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో స్వామిని దర్శించుకునేందుకు వచ్చింది. ఈ క్రమంలో తన పర్సును ఆలయ మాఢవీధిలో మర్చిపోయింది. ఆ పర్సును చూసిన ఎస్‌పీఎఫ్ సిబ్బంది ప్రచారశాఖకు వెళ్లి అనౌన్స్‌మెంట్ చేశారు. వెంటనే భక్తురాలు మానస అక్కడి వచ్చి పర్సును తీసుకుంది. ఆ పర్సులో రూ.1,460 నగదు, ఏటీఎం కార్డులు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు ఉన్నాయని, పర్సును అప్పగించిన ఎస్‌పీఎఫ్ సిబ్బందికి భక్తురాలు కృతజ్ఞతలు తెలిపింది.

'నార్ముల్' పాల సేకరణ ధర పెంపు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీకర్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: పాల ఉత్పత్తిదారులకు పాల సేకరణ ధరలను పెంచుతూ నార్ముల్ డెయిరీ పాలకవర్గం నిర్ణయించినట్లు నల్లగొండ- రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార యూనియన్ (నార్ముల్) చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హయత్‌నగర్‌లో జరిగిన పాలకవర్గ సమావేశంలో రైతుల సంక్షేమం కోసం పాల సేకరణ ధర పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. గేదెపాలు (కిలో వెన్నకు) రూ.756 నుంచి రూ.856కు, ఆవుపాలు (కిలో వెన్నకు) రూ.313 నుంచి రూ.353 పెంచామన్నారు. గేదెపాలు (6శాతం వెన్నకు) లీటరుకు రూ.45 నుంచి రూ.51కు అంటే లీటరుపై రూ.6 పెంచామని తెలిపారు. ఆవు పాలు (3శాతం వెన్నకు) లీటరుకు రూ.35.70 నుంచి రూ.40.25కి అంటే ప్రతి లీటరుపై రూ.4.55 చొప్పున పెంచామని వెల్లడించారు. ఈ పెంపు వెండర్స్ పాలకు వర్తించదని తెలిపారు. పెంచిన ధర ఈ నెల 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. సమావేశంలో సభ్యులు ఎ. గాల్‌రెడ్డి, కె. రాంరెడ్డి, డి. సోమిరెడ్డి, సీహెచ్. వెంకట్రాంరెడ్డి, పి. వెంకట్రాంరెడ్డి, కె. జయశ్రీ, సీహెచ్ సురేందర్‌రెడ్డి, ఆర్. లక్ష్మీనర్సింహారెడ్డి, కె. జలంధర్‌రెడ్డి, కె. అలివేలు, జి. శ్రీధర్‌రెడ్డి, కె. పాండు, జి. రాంరెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందనపల్లిలో చిరుత పిల్లల సంచారం?

- రెండింటిని చూశామంటున్న రైతులు

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలం చందనపల్లి గ్రామంలో చిరుతపులి పిల్లలు తిరుగుతున్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. దీంతో గ్రామంలో మళ్లీ కలవరం మొదలైంది. మార్చి 29న గ్రామ సమీపంలోని చెత్త డంపింగ్ యార్డు వెనుక భాగంలో 5-6 ఏళ్ల వయస్సు కలిగిన మగ చిరుత పులి మృతదేహం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. రెండు రోజుల నుంచి రెండు చిరుతపులి పిల్లలు సంచరిస్తున్నాయని రైతులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. చిరుత పిల్లలు ఉంటే వాటి తల్లి కూడా ఉండే ఉంటుందని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

మామిడి తోటలో సీసీ కెమెరాలు ఏర్పాటు..

మగ చిరుత మరణించిన ప్రాంతానికి సమీపంలోని మామిడి తోటలో పిల్లలు తిరగడం, అనంతరం అవి వరిపొలం గట్టు మీద నుంచి వెళ్తున్నట్టు చూసిన రైతు సమీప గ్రామాల రైతులకు చెప్పినట్టు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. నీటి వసతితోపాటు వరిపొలాలు, మామిడి, బత్తాయి తోటలు, ఇతర చెట్ల పొదలు ఎక్కువగా ఉండటంతో అక్కడే పిల్లలు సంచరిస్తున్నాయనేది గ్రామస్తుల అనుమానం. అయితే రైతుల సమాచారంతో గ్రామానికి వెళ్లిన అటవీ శాఖ అధికారులు దీన్ని నిర్ధారించేందుకు మామిడి తోటలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఐదు రోజుల క్రితం మగ చిరుత మరణించిందని పిల్లలు ఉండే అవకాశం లేదని అధికారులు చెప్పి వెళ్లి పోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గతంలో కూడా కొత్తగూడెం, శేషమ్మగూడెం ప్రాంతాల్లో చిరుతను చూసినట్లు రైతులు చెప్పినా అటవీ శాఖ అధికారులు తేలికగా తీసుకున్నారు. ఇటీవల చిరుత మృతదేహం వెలుగులోకి వచ్చిన తర్వాత అధికారులు నిర్ఘాంత పోయారు.

నిర్దిష్టంగా ఎవరూ చెప్పలేదు: అటవీ శాఖ అధికారి కేఎస్.రెడ్డి

చిరుత పిల్లలను చూసిన వారు ఎవరూ నిర్దిష్టంగా చెప్పలేదని అటవీ శాఖ అధికారి కేఎస్.రెడ్డి ‘సాక్షి’కి తెలిపారు. జిల్లాలో రాచకొండ అటవీ ప్రాంతం దగ్గరగా ఉండడంతో అప్పుడప్పుడూ మర్రిగూడ మండల పరిధిలో కనిపిస్తాయన్నారు. చిరుత పిల్లలను చూసినవారు వెంనే మాకు సమాచారం ఇచ్చినట్లయితే అవి తిరిగిన ప్రాంతంలో వాటి పాద ముద్రలను సేకరించి కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధిని చూసి ఎమ్మెల్యే ఓర్వలేకపోతోంది

- వంగపల్లి గ్రామ సర్పంచ్ ఆరోపణ


వంగపల్లిలో ఎమ్మెల్యే వేసిన శిలాఫలకాల చిత్రాలను ఫోన్‌లో చూపుతున్న సర్పంచ్ కవిత

యాదగిరిగుట్ట: మండలంలోని వంగపల్లి గ్రామంలో తాను చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఓర్వలేకపోతోందని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆ గ్రామ సర్పంచ్ కానుగు కవిత ఆరోపించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సొంత గ్రామమైన వంగపల్లిలో అభివృద్ధికి తాను, తన భర్త బాలరాజు అడ్డుపడుతున్నామని ఇటీవల మల్లాపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరోపించారని, అది అవాస్తవమన్నారు. తాను సర్పంచ్‌గా గ్రామంలో డంపింగ్ యార్డు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలను ఏర్పాటు చేశానని, సొంత ఖర్చులతో గ్రామస్తులకు వైకుంఠ రథాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న గొంగిడి సునీత తన సొంత గ్రామానికి ఏమీ చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. 2016లో గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు శిలాఫలకాలు వేశారని, అవి ఇప్పటి వరకు కట్టలేదని విమర్శించారు. గ్రామంలో రూ.కోటితో ఫంక్షన్‌హాల్ నిర్మిస్తామంటే పంచాయతీ నుంచి తీర్మానం ఇచ్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీ చీర శ్రీశైలం, కంతంగూడెం సర్పంచ్ శ్రీరాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కానుగు బాలరాజుగౌడ్, బందారపు భిక్షపతి, గుండు నర్సింహా పాల్గొన్నారు.

దోపిడీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

భువనగిరి: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తుడికి మాయమాటలు చెప్పి దోపిడీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులకు వెల్లడించారు. వికారాబాద్ జిల్లాకు చెందిన పడిగోముల ఎల్లారెడ్డి ఈ నెల 1వ తేదీన యాదగిరిగుట్టకు వచ్చాడు. స్వామివారి దర్శనం అనంతరం 2వ తేదీన తిరిగి ఇంటికి వెళ్లేందుకు యాదగిరిగుట్ట బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఎల్లారెడ్డి బస్సు ఎక్కుతుండగా అతడి వద్ద ఉన్న డబ్బులు ఉండటాన్ని గమనించిన భువనగిరి పట్టణంలోని అర్బన్‌కాలనీకి చెందిన అలకుంట్ల ఎంజర్, శైలజా అలియాస్ శాలు కూడా అదే బస్సులో ఎక్కారు. ఆ ఇద్దరు ఎల్లారెడ్డికి మాయమాటలు చెప్పి భువనగిరి మండలంలోని సురేంద్రపురి వద్ద బస్సులో నుంచి కిందకు దింపారు. సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి ఎల్లారెడ్డిని కర్రతో కొట్టి అతడి వద్ద ఉన్న నగదు, మొబైల్ ఫోన్‌ను లాక్కోని పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న భువనగిరి పోలీసులు రూరల్ సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. కాగా సోమవారం రాయగిరి చౌరస్తా వద్ద అనుమానాస్పదంగా కనిపించిన నిందితులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా, నిజం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.28 వేల నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్, పోలీసు సిబ్బంది అశోక్‌రెడ్డి, నరేందర్, శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- పెద్దవూర మండలంలో కారును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు..
- త్రిపురారం మండలంలో సైకిల్‌ను పాల వ్యాన్ ఢీకొని మరొకరు..
- బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో కుమారుడు దుర్మరణం, తండ్రికి గాయాలు


నుజ్జునుజ్జయిన కారు


ప్రమాదానికి కారణమైన బస్సు

పెద్దవూర: కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన నెల్లూరి మధుసూదన్‌రావు అలియాస్ మధుబాబు(46) నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి అతడు తన భార్య మిర్యాలగూడలోని తల్లిగారి ఇంటి వద్ద ఉండటంతో కల్వకుర్తి నుంచి మిర్యాలగూడకు కారులో బయల్దేరాడు. పెద్దవూర మండలంలోని సంగారం స్టేజీ దాటాక పిన్నవూర గ్రామ శివారులో జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై అకస్మాత్తుగా మతిస్థిమితం లేని మహిళ కారుకు అడ్డుగా రావడంతో ఆమెను తప్పించి ముందుకు వెళ్లగానే ఎదురుగా వస్తున్న కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వస్తూ కారును ఢీకొట్టింది. దీంతో మధుసూదన్‌రావు తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య హిమబిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

సైకిల్‌ను పాల వ్యాన్ ఢీకొట్టడంతో..

మోటకొండూర్: సైకిల్‌ని పాల వ్యాన్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మాటూర్ శివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మనబోలు గ్రామానికి చెందిన భిక్షపతి ఆదివారం తన భార్య సత్తమ్మతో కలిసి సైకిల్‌పై వర్దూర్ గ్రామానికి వెళ్లి సాయంత్రం స్వగ్రామం వస్తుండగా మాటూర్ శివారులో ఎదురుగా పాల వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడ్డ భిక్షపతిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సోమవారం మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ట్రాక్టర్ ఢీకొని..


సైదయ్య (ఫైల్)

త్రిపురారం: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో కుమారుడు మృతిచెందగా, తండ్రికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మాటూరు గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. త్రిపురారం ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాగడప గ్రామపంచాయతీకి చెందిన తండ్రీకొడుకులు రేలా నరసింహ, రేలా సైదయ్య(30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం ఉదయం కూలీ పని కోసం రాగడప నుంచి బెజ్జికల్ గ్రామానికి బైక్‌పై ఇద్దరూ వెళ్తున్నారు. ఈ క్రమంలో అడవిదేవులపల్లి మండలానికి చెందిన ట్రాక్టర్ తుంగపహాడ్ నుంచి అడవిదేవులపల్లి వైపు వెళ్తుండగా మాటూర్ గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బతండా వద్ద వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రేలా సైదయ్య, రేలా నరసింహకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు ఇరువురిని మిర్యాలగూడకు తరలిస్తుండగా మార్గమధ్యలో రేలా సైదయ్య మృతి చెందాడు. రేలా నరసింహ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు రేలా సైదయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రేలా అఖిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రాళ్లు తోలే ట్రాక్టర్లు పెద్ద పెద్ద సౌండ్ బాక్స్‌లు పెట్టుకొని అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

బావ, బావమరిది మధ్య ఘర్షణ

- తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బావమరిది మృతి

నకిరేకల్: బావ, బావమరిదిని మధ్య జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడిన బావమరిది ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని చందంపల్లిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లాలోని యండ్లపల్లి గ్రామానికి చెందిన యానాల సాయికుమార్(24) తల్లి భిక్షమమ్మ తన అమ్మగారి ఊరైన నకిరేకల్ మండలంలోని చందంపల్లి గ్రామానికి వచ్చింది. సాయికుమార్ కూడా అమ్మమ్మ ఊరికి వచ్చాడు. ఇటీవల సాయికుమార్ నిత్యం మద్యం సేవిస్తూ తన తల్లి భిక్షమమ్మతో తరచూ గొడవ పడుతున్నాడు. దీంతో భిక్షమమ్మ భర్త సైదిరెడ్డికి, హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నివాసముంటున్న అల్లుడు యారాల విజయ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలిపింది. సోమవారం యారాల విజయ్‌కుమార్‌రెడ్డి తన స్నేహితుడు బాణాల వెంకట్‌రెడ్డిని తీసుకుని చందంపల్లికి వచ్చారు. సాయికుమార్‌కు విజయ్‌కుమార్‌రెడ్డి నచ్చజెప్పుతుండగా ఇరువురు ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో సాయికుమార్‌కు తలకు దెబ్బలు తగలడంతో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.